క్లుప్తంగా

ఎస్ఆర్‌కేఆర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 6వ తేదీ నుంచి ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ టూల్స్ అనే అంశంపై వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. శిక్షణ శిబిరం పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో టెన్త్, ఇంటర్ పాసైన విద్యార్థులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారికి కూడా ఎమ్మెస్ ఆఫీస్‌లో వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి సాఫ్ట్‌వేర్స్ ఏ విధంగా ఉపయోగించాలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగినవారు ముందుగా సెల్: 96763 55492 నెంబర్‌కు ఫోన్ చేసి పేరును రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, వి చంద్రశేఖర్, సీహెచ్ రామినాయుడు, కె దుర్గాభవాని పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం దృశ్యం

భీమవరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తులవారి క్రీడా ప్రాంగణంలో వేసవి క్రికెట్ కోచింగ్ క్యాంపును శుక్రవారం కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ తమ కళాశాల ఆవరణలో చాలాఏళ్లుగా క్రీడలకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ వేసవిలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు క్రికెట్ శిబిరం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. శిక్షణలో క్రీడాకారులకు అవసరమైన వసతులు కళాశాల ఏర్పాటు చేస్తోందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, జాయింట్ సెక్రటరీ కె రామకృష్ణంరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ఫిజికల్ డైరెక్టర్ పివి నర్సింహరాజు, కోచ్ టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి



భీమవరంలో విద్యార్థులు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థి దశలో మాతృభాషతో పాటు ఆంగ్లభాషపై పట్టు సాధించడం ద్వారా సాంకేతిక విజ్ఞానం సాధించి భవిష్యత్తులో ప్రగతి పథంలో పయనిస్తారని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 10 రోజులుగా నిర్వహించిన ఇంగ్లీష్ భాషశిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సాధించడం ద్వారా ఉన్నతమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవచ్చునన్నారు. స్కూల్ కరస్పాండెంట్ కూనపరాజు రామకృష్ణంరాజు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమవరం(పకాశం చౌక్): వేసవిలో దాహార్తిని తీర్చడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసి డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని తుమ్మలపల్లి మంగరాజు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శ్రీవిజ్ఞానవేదిక, ఆర్టీసీ శాఖల సహకారంతో ప్రారంభించారు. దాత తుమ్మలపల్లి శివ మాట్లాడుతూ మా ట్రస్ట్ ద్వారా ఈ మజ్జిగ చలివేంద్ర కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ఆర్టీసీ సిఐ వై సురేష్, తుమ్మలపల్లి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

భీమవరం: ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల పనితీరును పరిశీలించారు.

చంద్రబాబు మాపై పగబట్టాడు : అవ్వాతాతల ఆగ్రహం

పింఛన్ డబ్బులు కోసం బ్యాంకుల్లో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు

భీమవరం (ప్రకాశం చౌక్): అవ్వా తాతలు, మహిళలకు అందాల్సిన పింఛన్లు ఎన్నికల అధికారుల ఆదేశాలతో ప్రభుత్వం పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసింది. ఈ సొమ్ము తీసుకునేందుకు పింఛనుదారులంతా బ్యాంకులకు రావడంతో ఆయా బ్యాంకుల వద్ద గుమిగూడాల్సి వచ్చింది. భీమవరంలోని పలు బ్యాంకుల వద్ద అవ్వాతాతలు, మహిళలు మండుటెండలో పడిలేస్తూ రావడమే కాకుండా గంటల తరబడి వేచిఉండే పరిస్థితుల్లో చంద్రబాబు తీరును తీవ్రంగా విమర్శించారు. పింఛను ఇవ్వకుండానే ఇబ్బందులు పెట్టేవాడు రేపు పింఛన్ పెంచేస్తానంటే ఎలా నమ్ముతామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెన్షన్ డబ్బులు కోసం మండుటెండలో ఆయా బ్యాంకులకు వస్తున్న వృద్ధులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తమ వంతు సేవా సాయం అందజేస్తున్నారు. బ్యాంకుకు వచ్చే వృద్ధులు ఇతర లబ్ధిదారులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నారు. శుక్రవారం భీమవరంలోని ఇండియన్ బ్యాంక్‌లో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు ఇతర పెన్షన్ లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారోజు గణేష్ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.



వీరవాసరం మండలం నౌడూరులో బ్యాంకు వద్ద పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు



యండగండి యూనియన్ బ్యాంకులో పింఛన్ కోసం వృద్ధుల పడిగాపులు



ఆకివీడు ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద పింఛన్ కోసం క్యూలో నిలబడ్డ వృద్ధులు, వితంతువులు

ఆకివీడు: పింఛన్ కోసం బ్యాంకుల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు శుక్రవారం కూడా పడిగాపులు పడ్డారు. తమకు పింఛన్ వచ్చిందో లేదోనని ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్న లబ్ధిదారులు క్యూలైన్లలో అగచాట్లు పడ్డారు. పింఛన్ అందుకున్న తరువాత మధ్యాహ్నం మండుటెండలో ఆపసోపాలు పడుతూ ఇళ్లకు వెళ్లారు. బ్యాంకుల్లో పింఛన్లు ఇవ్వడం పట్ల పలువురు పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ పంపిణీని అడ్డుకున్న కూటమి నాయకుల్ని దుమ్మెత్తిపోస్తున్నారు.

కొనసాగిన అవ్వాతాతల అగచాట్లు

ఉండి: చంద్రబాబు నీచ రాజకీయాలకు అన్ని వర్గాల ప్రజలతో పాటు తాముకూడా బలవుతున్నామని వృద్ధులు వాపోతున్నారు. మే నెల పింఛన్ డబ్బులు బ్యాంకుల్లో జమ కావడంతో వాటిని తీసుకునేందుకు వృద్ధులు, వితంతువులు బ్యాంకులకు పోటెత్తారు. దీంతో చాలా సమయం బ్యాంకు క్యూలైన్ల వద్ద పడిగాపులు పడ్డారు. ఉండి, పెదపుల్లేరు, మహదేవపట్నం, కోలమూరు, యండగండి గ్రామాల్లోని బ్యాంకుల వద్ద రద్దీ ఎక్కువ కావడంతో లావాదేవీలు నెమ్మదించాయి. దీంతో పింఛన్‌దారులు ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకముందే వలంటీర్‌లు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవారని.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ చలవతో ఇలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పింఛన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రాణాలకంటే మీ రాజకీయాలు ముఖ్యమా అంటూ వారు వాపోయారు.

మా ఉసురు తగులుతుంది...

వలంటీర్లు ఇంటి గుమ్మంలోకి వచ్చి పింఛను ఇచ్చేవారు. చాలా సంతోషంగా ఉండేది. చంద్రబాబుకు ఏమి జబ్బు వచ్చిందో కానీ మాలాంటి ముసలోళ్లను ఈ ఎండల్లో రోడ్డుమీదికి ఈడ్చుకొచ్చాడు. మా ఉసురు తగిలే రోజు ఎంతో దూరంలేదు. మళ్లీ జగన్‌బాబే రావాలి. పింఛను డబ్బు పట్టికెళ్లి మందులు కొనుక్కోవాలి ఇక్కడ ఈ జనాన్ని చూస్తుంటే ఇవాళ అవుతుంతో లేదోనని భయమేస్తోంది.



జంగం మరియమ్మ వృద్ధాప్య పింఛన్

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

భీమవరం (ప్రకాశంచౌక్): సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సతీమణి సత్యరాణి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 25, 26 వార్డులలో ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి 2024 వరకు ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్‌ను, ఎంపీగా గూడూరి ఉమాబాలను ప్రజలు గెలిపించి భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రంధి కుటుంబ సభ్యులు భావి శ్రీ, ప్రత్యూష, సుధా, పార్టీ సీనియర్ నాయకులు రాయప్రోలు శ్రీనివాసమూర్తి, జే సీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, జట్ల రాంబాబు, కట్టా మధు, కోసిరెడ్డి బాలాజీ, కొమ్ము శ్రీను, పోతుల జక్రి, కొమ్ము ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

భీమవరం అర్బన్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ , మండల యువత అధ్యక్షుడు జవ్వాది గణేష్ అన్నారు. భీమవరం మండలంలో గుట్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు మద్దతుగా శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పర్తి సత్యనారాయణ, జవ్వాది గణేష్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మరోసారి ఎమ్మెల్యే గెలిపించుకోవాలని కోరారు. 100 పడకల ఆస్పత్రికోసం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రూ.16 కోట్లు విలువ చేసే 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చారన్నారు. రూ. 130 కోట్లతో భీమవరం పట్టణాన్ని అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెలంకూరి శివ హనుమప్రసాద్, సత్యనారాయణ మూర్తి, సర్పంచ్ ఒడగు ముత్యాలరావు, కొప్పర్తి రత్తయ్య, సూరిబాబు,సంధి డేనియేలు, కొప్పర్తి రంగారావు, కొప్పర్తి ప్రసాద్, కొప్పర్తి సుబ్బారావు, చెలంకూరి శ్రీనివాస్, తిరుమాని ఏడుకొండలు, మాండ్రు శ్రీను, వర్ధనపు డేవిడ్ రాజు, రేవు నరసింహస్వామి, నీటిపూడి రమేష్, రేవు శ్రీను, మధు, కాటిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు



గుట్లపాడులో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు



వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(పకాశం చౌక్): పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మే 3వతేదీ ఉదయం ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనము, అగ్ని ప్రతిష్ఠ వాస్తు మండపారాధన వాస్తు శుద్ధి దీక్షా సూక్త పఠనము తదితర పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జానపాటి మధు తాడికొండ కోటేశ్వరరావు గుప్తా, గొలుగురి వెంకట రెడ్డి , కడలి నాగేశ్వరరావు, అల్లం వెంకట నాగ రమేష్, ఎం.విజయ్ కుమార్, ఏవి రామారావు, కడలి వెంకటేశ్వరరావు, అల్లూరి బంగార్రాజు, కడలి ఫణి కుమార్, మారిశెట్టి రాంప్రసాద్, దాతలు పాల్గొన్నారు

ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

కాళ్ల: ఎవరు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు, ఉండిలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల పరిపాలనలో వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని కష్టపడ్డ వారికి పార్టీలో ఎంత ప్రాముఖ్యత ఇస్తామో, వెన్నుపోటు పొడిచినవారికి గుణపాఠం చెప్పేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.



ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయం గెలుపునకు కారణమవుతాయని జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెన్మెత్స దుర్గాప్రసాద్ రాజు అన్నారు. కలవపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును, ఎంపీగా గూడూరి ఉమబాలను గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఇంటివద్దకే పింఛన్లు అందజేయడంతోపాటు సంక్షేమ పథకాలన్ని కొనసాగుతాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పీవీఎల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కలవపూడి సొసైటీ అధ్యక్షుడు బర్రె గంటయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూర చిన్న, మంతెన పండురాజు, ముదిండి మురళిరాజు, కంతేటి రాంబాబు, మంతెన రామరాజు, సురేష్ రాజు, సాగిరాజు సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ నాగరాజు, రేవు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



కలవపూడి గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొలిరోజు ప్రశాంతంగా హోమ్ ఓటింగ్



కలిగొట్లలో హోమ్ ఓటింగ్ నిర్వహిస్తున్న ఎంపీడీవో రవీంద్ర



పాలకోడేరులో ప్రిసైడింగ్ అధికారి అనూహ్య ఆధ్వర్యంలో ఓటు వేస్తున్న దృశ్యం

ఉండి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన హోమ్ ఓటింగ్ కార్యక్రమం తొలిరోజు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. కలిగొట్ల గ్రామంలో ఎంపీడీవో ఎస్ రవీంద్ర ఆధ్వర్యంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఉండి మండల పరిధిలో 9 మంది, కాళ్లలో 8 మంది, పాలకోడేరులో 8 మంది, ఆకివీడు మండలంలో 12 మంది, మున్సిపాలిటీలో 9 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఆకివీడు మున్సిపల్ కమిషనర్, సహాయ సిబ్బంది, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

పాలకోడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 85 సంవత్సరాలు పైబడిన వారు, 40 శాతం కన్నా ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారికి ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించిన నేపథ్యంలో శుక్రవారం పాలకోడేరు మండలంలో తొలిరోజు హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. మండలంలో శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు, పాలకోడేరు, వేండ్ర, కొండేపూడి గ్రామాల్లో ఎంపీడీవో టి అనూహ్య ఆధ్వర్యంలో హోమ్ ఓటింగు నిర్వహించారు. రహస్య ఓటింగు విధానం ద్వారా ఇంటి వద్దనే వారు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎంపీడీవో టి అనూహ్య తెలిపారు. పాలకోడేరు మండలం పరిధిలో మొత్తం 8 మంది ఓట్లు వేశారని తెలిపారు.

నవరత్నాలతో పేదలకు మేలు

ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్



పాలకోడేరు ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: నవరత్నాల పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం ఆయన టాపులేని వాహనంలో గరగపర్రు, మోగల్లు మైప, కోరుకొల్లు గ్రామాల్లో పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు ఇంటింటికీ వలంటీర్ల ద్వారా అందజేయడం జరిగిందన్నారు. అలాంటి జగనన్నను మరలా ముఖ్యమంత్రి చేసేందుకు ఇటీవల జరుగుతున్న సిద్ధం సభలే నిదర్శనం అన్నారు. గతంలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన సంగతిని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి పేరుతో మరలా ప్రజలను మోసం చేయడానికి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. సంక్షేమ పాలన చూసి మరలా ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించాలని ఆయన కోరారు. గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించామని ఇప్పుడు 175కి 175 సీట్లు సాధించేలా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తొలుత మోగల్లులో పార్టీ శిబిరాన్ని పీవీఎల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు, డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, పెన్మెత్స వెంకటరాజు (బాబు), సీతారామరాజు, చేకూరి పెదచంటి, చినచంటి, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, దెందుకూరి వెంకటరాజు, పెన్మత్స ప్రసాదరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, మంతెన బాపిరాజు, దొడ్డా విసు, శివకోడు హనుమంతరావు, జాలే సునీత, కోనాల ప్రకాష్, మద్దుల మౌళి, చిల్లా రత్నరాజు, గోడి భూషణం, ఆకుల బుజ్జి, పంపన శ్రీను, షేక్ పాపాసాహెబ్, కాటూరి శాంతకుమారి, పెన్మెత్స వెంకటలక్ష్మి, తంగెళ్ల ఆనందరాజు, గుత్తుల హరిప్రసాద్, వీరమల్లు అశోక్, వెంకన్న, గరగపర్రు అబ్బులు, సునీతసాల్మన్ రాజు, చింతలపాటి సూర్యనారాయణరాజు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

యువత అంతా జగన్ వెంటే..

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

కాళ్ల: యువత అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. ఆకివీడు మండలం ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో 8, 9, 12 వార్డులకు చెందిన టీడీపీ కార్యకర్తలు 50 మంది శుక్రవారం కనుమూరి ఆనందవర్మ, కౌన్సిలర్ వంగా జోష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పీవీఎల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులపై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకివీడు టౌన్ ప్రెసిడెంట్ అంబటి రమేష్, మండ ఏసేబు, గుట్ల దానియేలు, బొండాడ అబ్రహం , దోనే భరణి, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): హింసాత్మక సంఘటనలు, రీపోల్‌కు తావు లేనివిధంగా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ కోరారు. జిల్లాలకు కేటాయించబడిన ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్ నిర్మల్ రాజ్, పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పీయూష్ శుక్లా, అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు మోహల్ అగర్వాల్, విక్రమాదిత్య మీనా, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మాట్లాడుతూ ఈవీఎం వాడకంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి సాధారణ పరిశీలకురాలు ఎం.దీప మాట్లాడుతూ నరసాపురం పార్లమెంటు పరిధిలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ వివరిస్తూ రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించి తదుపరి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు బిఎల్వోల ద్వారా సంబంధిత ఓటరుకు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు పాల్గొన్నారు.